

చిక్కరు.. దొరకరు!

పండ్ల తోటలు, కూరగాయల సాగుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అంతంత మాత్ర మే ఉండగా, ఉద్యానశాఖలో కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కారణంగా పండ్ల తోటల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పండ్లతోట విస్తీర్ణంలో మొదటి స్థానంలో ఉంది. ప్రస్తుతం పండ్లతోట విస్తీర్ణం రోజురోజు కూ పడిపోతోంది.నీటి వనరులకు అనుగుణంగా రైతులు వరి లేదా పత్తి సాగుచేస్తున్నారు.

- నల్లగొండ



» రైతులకు అందుబాటులో లేని ఉద్యానశాఖ అధికారులు » పంట సాగుపై సలహాలు, సూచనలు కరువు » బడా రైతులు ఫోన్ చేస్తేనే అందుబాటులోకి » 36మందికి ఉన్నది 14మంది హెచ్‌వోలే

పండ్ల తోటలతో దీర్ఘకాలిక లాభాలు ఉంటాయని రైతులు తోటల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా బత్తాయి సాగవుతోంది. ఆ తరువాత నిమ్మ, మామిడి తోటలు సాగవుతున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో బత్తాయి సాగు 65వేల ఎకరాలకు మించి లేదు. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, చీడ పీడల సమయంలో సలహాలు ఇవ్వాల్సిన ఉద్యానశాఖ అధికారులు లేకపోవడం, తదితర కారణాలతో తోటల విస్తీర్ణం పెరగకపోగా రానురానూ తగ్గుతూ వచ్చింది. బత్తాయికి వేరుకుళ్లు తెగుళ్లతో పాటు సరైన మార్కెట్ సదుపాయంలేక రైతులకు నష్టం వాటిల్లుతోంది. నల్లగొండలో బత్తాయి మార్కెట్ ఏర్పాటు చేసినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది. రైతులు ఢిల్లీ, కలకత్తాకు చెందిన దళారులకు బత్తాయిని విక్రయిస్తున్నారు. వారు కూడా ధర అంతంత మాత్రమే ఇస్తుండటంతో నష్టం వస్తోంది. అంతేగాక బత్తాయికి భారీగా పెట్టుబడులు పెరిగాయి. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక నష్టాలు చవిచూడటంతో రైతులు బత్తాయి నుంచి వరి, పత్తి సాగువైపు మళ్లారు.

అందుబాటులో లేని హెచ్‌వోలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 36మంది హెచ్‌వో(హార్టికల్చర్ ఆఫీసర్)లు ఉండాలి. అయితే ఈ శాఖలో ఏళ్లుగా నియామకాలు లేకపోవడం, ఉన్నవారు ఉద్యోగ విరమణ చేయడంతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కేవలం 14మంది హెచ్‌వోలే మిగిలారు. నల్లగొండ జిల్లాలో మొత్తం 8మంది హెచ్‌వోలు ఉండగా, అందులో ఒకరు జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్నారు. మిగతా ఏడుగురు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో ముగ్గురు, యాదాద్రి జిల్లాలో నలుగురు హెచ్‌వోలు ఉన్నారు. ఒక్కో హెచ్‌వో నాలుగు నుంచి ఐదు మండలాల బాధ్యతలు చూస్తున్నారు. వాస్తవానికి రెండు మండలాలకు ఒక హెచ్‌వో ఉంటేనే రైతులకు అందుబాటులో ఉంటారు. నియామకాలు లేకపోవడంతో హెచ్‌వోలు సైతం అన్ని గ్రామాలకు తిరిగే పరిస్థితి లేదు. కొంతమంది హెచ్‌వోలు కనీసం ఫోన్ కూడా ఎత్తి సమాచారం ఇవ్వడం లేదని, ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఎత్తడం లేదని రైతులు వాపోతున్నారు. రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది రాజకీయనాయకులు, బడా వ్యాపారులు పెద్ద మొత్తంలో భూములు కొనుగోలు చేసి పండ్ల తోటలు సాగుచేస్తున్న ప్రాంతాలు ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. వారు ఫోన్ చేస్తే మాత్రం తోటల్లోకి వెళ్లి సలహాలు, సూచనలు ఇచ్చే అధికారులు చిన్న, సన్నకారు రైతులకు మాత్రం అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

కూరగాయల సాగుకు రైతుల అష్టకష్టాలు



కూరగాయలు సాగు చేసే రైతులు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. ఏ సీజన్‌లో, ఏ సమయంలో, ఏ నెలలో, ఏ కూరగాయకు ఎంత ధర ఉంటుంది? పెట్టుబడులైనా దక్కించుకుంటామా? లాభాలు వస్తాయా? అనే మీమాంసలో రైతులు నిరంతరం మదన పడుతుంటారు. టమాటాకు వచ్చిన్ని తెగుళ్లు, దోసకాయ సాగుకు ఉండవు. వంకాయ తోటకు వచ్చిన తెగుళ్లు బెండకాయకు ఉండవు. ఇక ఆకు కూరల పరిస్థితీ అంతే. ఒక్కో కూరగాయ సాగుకు ఒక్కో తెగులు ఆశిస్తుంది. వీటిపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఒక్కో కూరగాయ పంట సాగుకు విభిన్న పురుగు మందులు పిచికారీ చేసి రైతులు పంటను దక్కించుకోవాల్సి ఉంటుంది. కూరగాయల సాగులో ఒక్కోసారి పెట్టుబడులు కూడా రావు. ఇన్ని కష్టాలు ఎదుర్కొని కూరగాయలు సాగు చేసే రైతులకు హెచ్‌వోలు అందుబాటులో ఉండటం లేదు.

రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం



రైతులకు పండ్ల తోటలతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై సలహాలు, సూచనలు ఇస్తున్నాం. హెచ్‌వోలకు రైతులు ఫోన్ చేస్తే తప్పకుండా వారు స్పందించి గ్రామాలకు వెళ్లి తోటలను సందర్శించి సలహాలు, సూచనలు ఇచ్చేలా ఆదేశించాం. ఎవరైనా హెచ్‌వో సమావేశంలో ఉండి ఫోన్ ఎత్తకపోవచ్చు. సమావేశం తరువాత ఆ నెంబర్‌కు సదరు హెచ్‌వో వెంటనే ఫోన్ చేసి సమస్యను అడిగి తెలుసుకుని పరిష్కరించేలా ఆదేశాలు ఇస్తాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో పండ్ల తోటలతో పాటు కూరగాయాల సాగును పెద్ద మొత్తంలో ప్రోత్సహిస్తున్నాం.

- సంగీత లక్ష్మీ, నల్లగొండ జిల్లా ఉద్యానశాఖ అధికారి

ఆయిల్‌పామ్ రైతులకు సైతం

బత్తాయి, మామిడి ఇతర కూరగాయల సాగు చేస్తున్న రైతులపై నిర్లక్ష్యం చూపుతున్న కొందరు హార్టికల్చర్ అధికారులు ఆయిల్‌పామ్ రైతులకు సైతం అందుబాటులో ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 20వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. తొలుత నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు ప్రారంభం కాగా, గత ఏడాది నుంచి యాదాద్రి జిల్లాలో సైతం రైతులు ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు చూపుతున్నారు. కొన్ని నెలల క్రితం ఆయిల్‌పామ్ తోటలు కూడా తెగుళ్ల బెడదను ఎదుర్కొన్నాయి. బత్తాయి తోటలకు బదులు ఆయిల్‌పామ్ సాగు చేస్తే ఏళ్ల తరబడి ఆదాయం లభిస్తుంది. అయితే రైతులకు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి అవగాహన కల్పించాల్సిన అధికారులు మొక్కుబడిగా సందర్శిస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఆయిల్‌పామ్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో వారిని ప్రోత్సహిస్తే విస్తీర్ణం మరింత పెరుగుతుంది. అయితే పోస్టుల భర్తీ లేకపోవడం ఓ సమస్య కాగా, కొంత మంది హెచ్‌వోల అలసత్వం రైతులకు ఇబ్బంది తెచ్చిపెడుతోంది.



ఇది స్పీడ్‌బ్రేకర్ మాత్రమే... భవిష్యత్ బీఆర్‌ఎస్‌దే

» కాంగ్రెస్ నేతల్లో అసహనం మొదలైంది » ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటాలి
» అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా.. మాది ప్రజల పక్షమే
» సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

యాదాద్రి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఫలితాలు స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని..భవిష్యత్ అంతా బీఆర్‌ఎస్‌దేనని సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. శుక్రవారం భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో అబద్ధాలు మాట్లాడిన కాంగ్రెస్ నేతలకు,అధికారంలోకి వచ్చాక అసహనం పెరిగిందన్నారు.కాంగ్రెస్ 420హామీలపై గ్రామాలు, తండాల్లో చర్చకు పెట్టాలన్నారు. ఓటమి శాశ్వతం కాదని, గెలుపునకు నాంది అని, బీఆర్‌ఎస్‌కు ఇది స్పీడ్ బ్రేకర్ మాత్రమేనన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమంకోసం పనిచేశాం,ప్రతిపక్షంలోనూ ప్రజల కోసమే కొట్లాడుదామన్నారు.అధికార పక్షమైనా,ప్రతిపక్షమైనా ప్రజల పక్షమేనని తెలిపారు.

•7లో..

రూ.2లక్షల రుణమాఫీ ఏమైంది ?

» కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రూ.15వేల కోట్ల అప్పులు
» రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతారా?
» మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



దేవరకొండ, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేస్తామన్న రూ.2లక్షల రుణమాఫీ ఏమైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం దేవరకొండలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రూ.15వేల కోట్లు అప్పులు చేసిందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పులు కూడా పుట్టవన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అప్పులు చేస్తే, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని బద్నాం చేస్తున్నారని, అప్పులు చేసి అభివృద్ధి చేయడం తప్పా అని ప్రశ్నించారు.

మతతత్వ, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి




మాట్లాడుతున్న కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 2: బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మతతత్వ, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. శుక్రవారం ఆలేరులో జరిగిన భువనగిరి పార్లమెంట్ మహిళా కాంగ్రెస్ సమీక్షా సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పేద వర్గాల పార్టీ అని, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. దేశంలోనే గొప్పగొప్ప నాయకులను తయారు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. తొమ్మిదిన్నరేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నిత్యావసర ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కుంభకోణాలకు, భూ ఆక్రమణలకు పాల్పడింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, అందుకే రాష్ట్ర ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు పెద్దపీట వేయడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. మహిళా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని ఎంపీ స్థానాలను గెలిపించడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ సమావేశంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, దీప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అతుక్కుపోయాడు

» ఒకే ప్రాంతంలో 20 ఏళ్లుగా తిష్ఠ » ఆ సారు కనుసన్నలోనే పనులు, పైరవీలు » డీఆర్‌డీవో కార్యాలయంలో పరిస్థితి



నల్లగొండ, ఫిబ్రవరి 2: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో ఓ అధికారి ఏకంగా 20 ఏళ్లుగా తిష్ఠ వేసి రాజ్యమేలుతున్నాడు. ఒకే ప్రాంతంలో ఇన్నేళ్లు ఉన్నా గత ప్రభుత్వంతో పాటు అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో ఆడిందే ఆటగా మారింది. ఏళ్లుగా అదే కార్యాలయంలో కొనసాగుతుండటంతో ఉద్యోగులు, సిబ్బంది ఆ సారు చెప్పిన మాట వినాల్సిందే.

సదరు సారు ఓ క్లస్టర్‌లో పనిచేస్తూ జులుం ప్రదర్శిస్తూ వేధింపులకు గురి చేస్తున్నట్లు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా, తనను మార్చరని, రాజకీయ అండదండలు, తనకున్న పలుకుబడితో ఎవ్వరూ ఏమి చేయలేరని బాహాటంగా చెబుతూ కార్యాలయంలో కర్రపెత్తనం చేస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతోంది. 20 ఏళ్లుగా ఒకే ప్రాంతంలో ఉంటే ఆ శాఖ ఉన్నతాధికారులు ఎందుకు అతడికి స్థాన చలనం కల్పించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైరవీలు, పనులు ఆ సారు ద్వారానే జరిగేలా కార్యాలయంలో చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులతో పరిచయాలు పెంచుకుని, ఆ పలుకుబడితో ఆయన ఇక్కడ తిష్ఠవేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. సీఎల్‌ఆర్‌సీలో శిక్షణ తరగతులు ఇప్పటికే నిలిచిపోయాయి. శిక్షణను నిలిపి వేసినా, ఇంకా ఆ విభాగంలో ఎలాంటి పని లేకున్నా, అక్కడ ఈ సారు పనిచేస్తుండటం గమనార్హం. ప్రభుత్వ వేతనం పొందుతూ, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న సదరు అధికారిపై శాఖాపర చర్యలు తీసుకోకపోవడం ఏంటని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. మొత్తంగా జీవనోపాధుల వనరుల కేంద్రం అబాసుపాలవుతోంది. డీఆర్‌డీఏలో ఓ అధికారి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయాన్ని డీఆర్‌డీవో కాళిందినిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఈవిషయం తన దృష్టికి రాలేదని తెలిపారు. ఎవరైనా దృష్టికి తీసుకువస్తే శాఖాపర విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పల్లెల్లో మొదలైన ప్రత్యేక అధికారుల పాలన

పంచాయతీల్లో బాధ్యతల స్వీకరణ



నార్కట్‌పల్లి మేజర్ పంచాయతీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు తీసుకుంటున్న ఎంపీవో సత్యనారాయణ

నల్లగొండ, ఫిబ్రవరి 2: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని 1,740 పంచాయతీలకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక అధికారులను నియమించారు. చిన్న పంచాయతీలు ఉంటే ఒక్కో అధికారికి రెండు, లేదా మూడింటి బాధ్యతలను అప్పగించారు.

సర్పంచుల, ఉపసర్పంచుల, వార్డు సభ్యుల పదవీకాలం గురువారంతో ముగిసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారి స్థానంలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకున్నారు. గెజిటెడ్ అధికారులు, నాన్ గెజిటెడ్ అధికారులను ప్రతీ పంచాయతీకి ప్రత్యేక అధికారిని నియమించాలని ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. కానీ పంచాయతీ కార్యదర్శుల కంటే తక్కువ హోదా ఉన్న వారిని ప్రత్యేక అధికారులుగా నియమిస్తే ఇబ్బంది కలుగుతుందని భావించి నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు ఈ విధులను అప్పగించవద్దని నిర్ణయించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఈఈలు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, విద్యుత్‌శాఖ సహాయ ఇంజనీర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వ్యవసాయ అధికారులు, ఆరోగ్యశాఖ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు, ఉప తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు. అధికారుల కొరత, చిన్న పంచాయతీలు ఉన్నచోట రెండు, మూడు పంచాయతీలను క్లస్టర్‌గా చేసి ఒక్కో ప్రత్యేకాధికారికి బాధ్యతలు అప్పగించారు. వారికి కేటాయించిన గ్రామాలకు వెళ్లిన ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే సర్పంచులు, ఉపసర్పంచుల నుంచి రికార్డులు, చెక్‌బుక్‌లు, డిజిటల్ సంతకాల 'కీ'లను గ్రామ కార్యదర్శులు స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక అధికారికి, గ్రామ కార్యదర్శికి కలిపి ప్రభుత్వం జాయింట్ చెక్ పవర్ ఇవ్వనుంది. వారి పేరిట డిజిటల్ సంతకాల 'కీ' కూడా ఇవ్వనుంది.

పీడీఎస్ బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 2: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారాపేదలకు ఇచ్చే బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించినా, ఎవరైనా కొనుగోలు చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ రేషన్ దుకాణం ఎదుట బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. రేషన్ డీలర్లు విధిగా సమయ పాలన పాటించాలని, దుకాణాలను తెరిచి ఉంచి, బియ్యాన్ని సకాలంలో లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రేషన్ డీలర్లు అథరైజేషన్ రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జీలు ప్రతీ నెల 10వ తేదీలోగా బియ్యం రేషన్ దుకాణాలకు చేరుకునేలా చూడాలని ఆదేశించారు.జిల్లాలో మొత్తం 19,93,360యూనిట్ల ఈ-కేవైసీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 9,68,698(69.51శాతం)పూర్తయిందన్నారు. ఇంకా 4,24,932 యూనిట్ల ఈ-కేవైసీ చేయాల్సి ఉందన్నారు. నెలాఖరులోగా ఈ-కేవైసీ పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల సంస్థ డీఎం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలి

» మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి » మంత్రి ఉత్తమ్‌కు రైతు సంఘం వినతి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ, నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 2: సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం రైతుసంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా జూలకంటి మాట్లాడుతూ, ఇప్పటికే రైతులు చెరువుల నీటిని ఆధారం చేసుకొని వరి సాగు చేశారన్నారు. చెరువుల్లో నీరు అడుగంటడంతో భూగర్భ జలాలు తగ్గి బోరుబావులు ఎండిపోతున్నాయన్నారు. వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో వరి పొలాలు పొట్టదశకు చేరుకున్నాయని, నీరు అందక పైర్లు ఎండిపోయే స్థితికి చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 10రోజుల పాటు ఎడమకాల్వకు నీరు విడుదల చేసి చెరువులు నింపితే భూగర్భజలాలు పెరిగి బోరు బావులతో రైతులు సేద్యం చేస్తారన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ ఎన్నెస్పీ ఎస్‌ఈకి ఫోన్ చేసి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఎం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మల్లు నాగార్జునరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, బండ శ్రీశైలం, పారేపల్లి శేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టుపై విద్యుత్ సమస్యకు పరిష్కారం

» రూ.7లక్షలతో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు » ఘాట్ రోడ్డు వీధి దీపాలు, పార్వతీ అమ్మవారి ఆలయానికి విద్యుత్ సరఫరా



గుట్టపై నుంచి ఘాట్ రోడ్డు మీదుగా అమ్మవారి ఆలయం వరకు ఏర్పాటుచేసిన కొత్త విద్యుత్ లైన్

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రూ.7లక్షల అంచనా వ్యయంతో 100కేవీ సామర్థ్యం ఉన్న కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో దేవస్థాన పరిధిలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడింది. ఇప్పటి వరకు దేవస్థానంలో 100కేవీ సామర్థ్యం ఉన్న కేవలం ఒక ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే ఉంది. దీని నుంచే దేవస్థాన పరిధిలో నీటిని పంపింగ్ చేసే బోరు మోటార్లు, అద్దె గదులు, కార్యాలయం, ఆలయాలు, విద్యుత్ లైట్లు, ఇతర ప్రదేశాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఏటా జరిగే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో అదనపు విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌కో అధికారులు సుమారు 10 రోజుల పాటు వినియోగం కోసం తాత్కాలికంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి తిరిగి వెనక్కి తీసుకెళ్లేవారు. అందుకు అయ్యే ఖర్చును దేవస్థానం ఏటా చెల్లిస్తోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం గుట్టపై అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటే ప్రత్యామ్నాయంగా దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్ నిర్ణయించారు. అందుకు రూ.7లక్షల అంచనాతో ట్రాన్స్‌కో రూపొందించిన ప్రతిపాదనలను దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు పంపారు. దీనికి ఆమోదం లభించడంతో గుట్టపై ఘాట్ రోడ్డులోని భారీ శివుడి విగ్రహం వెనుక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుట్టపైకి విద్యుత్ సరఫరాకు పరిమితం చేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఘాట్ రోడ్డు, ఆలయ పరిధిలోని వీధి దీపాలకు, గుట్ట కింద పార్వతి అమ్మవారి ఆలయం వరకు సుమారు 30కిపైగా స్తంభాలను పాతి విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

కందులకు పెరిగిన డిమాండ్

సూర్యాపేట మార్కెట్‌లో గరిష్ట ధర రూ.10,062, తిరుమలగిరిలో రూ.10,217

సూర్యాపేట సిటీ / తిరుమలగిరి, ఫిబ్రవరి 2 : సూర్యాపేట జిల్లాలో కంది పంట క్వింటా రూ.10వేలకు పైగా పలుకుతోంది. ధర రూ.7000లు కాగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో గురువారం రూ.9,999లు పలుకగా, శుక్రవారం రూ.10,062లు ధర పలికింది. ఐదుగురు రైతులు 17 బస్తాల కందులు తీసుకురాగా, వాటిలో ఒక రైతుకు చెందిన కందులకు రూ.10,062లు ధర కేటాయించారు. కనిష్ఠ ధర రూ.9,572లు, మోడల్ ధర రూ.10,033 లు ధరలను ఖరీదుదారులు నిర్ణయించారు. అంతేకాకుండా తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో వారం రోజులుగా కందులకు రికార్డు ధరలు నమోదవుతున్నాయి. శుక్రవారం 544 బస్తాల్లో 321 క్వింటాళ్ల కందులు రాగా తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన రైతు గుగులోతు బద్రుకు చెందిన 10 క్వింటాళ్ల కందులు రూ.10,217 ధర పలికింది. కనిష్ఠంగా రూ.8089 ధర పలికింది. మద్దతుకు మించి ధరలు లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు ఉత్తర్వుతో నిలిచిన అవిశ్వాస ఫలితం

గరిడేపల్లి, ఫిబ్రవరి 2 : హైకోర్టు ఆదేశంతో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ముప్పారపు రామయ్యపై అవిశ్వాస ఫలితాన్ని నిలిపివేసినట్లు జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం కీతవారిగూడెంలోని పీఏసీఎస్ సంఘ కార్యాలయంలో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని నిర్వహించారు. అయితే అవిశ్వాసంపై చైర్మన్ హైకోర్టును ఆశ్రయించడంతో ఈ నెల 5వ తేదీ వరకు ఫలితాన్ని ప్రకటించకుండా నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో 5వ తేదీ తర్వాత హైకోర్టు సూచనల ప్రకారం తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రాయినిగూడెం పీఏసీఎస్ పరిధిలో 13 మంది డైరెక్టర్లు ఉండగా అందులో కాంగ్రెస్ పార్టీ నలుగురు, మిగిలిన తొమ్మిది మంది బీఆర్ఎస్ పార్టీ గెలుచుకుంది. అనంతరం చైర్మన్‌గా కాచవారిగూడెం గ్రామానికి చెందిన ముప్పారపు రామయ్య, కీతవారిగూడెం గ్రామానికి చెందిన బొల్లెపల్లి రామనాథంను వైస్‌చైర్మన్‌గా ఎన్నుకున్నారు. కొంతకాలానికి ఒక డైరక్టర్ చనిపోగా 12 మంది డైరెక్టర్లు ప్రస్తుతం ఉన్నారు. అందులో బీఆర్ఎస్‌కు చెందిన 8మందిలో ఐదుగురు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ బలం తొమ్మిదికి చేరింది. బీఆర్ఎస్ బలం మూడుకు పడిపోయింది. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు పావులు కదిపి చైర్మన్ అక్రమాలపై అవిశ్వాసం ప్రకటించాలని కోరుతూ జనవరి 10న జిల్లా కోఆపరేటివ్ అధికారికి 9 మంది డైరెకర్లు నోటీసు అందించారు. అవిశ్వాసం ఈ నెల 2వ నిర్వహిస్తామని డీసీవో ప్రకటించారు. అయితే జనవరి 24న చైర్మన్ హైకోర్టును ఆశ్రయించగా ఫలితాన్ని ప్రకటించవద్దని స్టే ఇచ్చింది. ఇదిలా ఉండగా శుక్రవారం తొమ్మిది మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాన సమావేశానికి హాజరయ్యారు. చైర్మన్ ముప్పారపు రామయ్య, వైస్‌చైర్మన్ బొల్లెపల్లి రామనాథం మరో బీఆర్ఎస్ డైరక్టర్ హాజరుకాలేదు. తొమ్మిది మంది సమావేశానికి రావడంతో కోరం సరిపోవడంతో అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించారు. అనంతరం హైకోర్టు ఆదేశానుసారం ఈ నెల 5 వరకు ఫలితాన్ని వాయిదా వేస్తున్నట్లు డీసీవో శ్రీధర్ తెలిపారు.



విజయం తమదేనని ప్రకటిస్తున్న డైరెక్టర్లు

పీఏసీఎస్‌ను భ్రష్టుపట్టించారు: అల్లం ప్రభాకర్‌రెడ్డి

రాష్ట్రంలోనే మూడో అతిపెద్ద పీఏసీఎస్‌గా రైతులకు సేవలందిస్తున్న రాయినిగూడెం పీఏసీఎస్‌ను బీఆర్ఎస్ నాయకులు, చైర్మన్ భ్రష్టుపట్టించారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు అల్లం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సమావేశ అనంతరం మీడియాతో మాట్లాడుతూ అవిశ్వాసాన్ని ఎదుర్కోలేక కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని అందుకు చైర్మన్, వైస్‌చైర్మన్‌లు సమావేశానికి హాజరు కాలేదన్నారు. త్వరలో చైర్మన్‌ను ఎన్నుకుంటారని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ హయంలో గోదాం నిర్మాణ సమయంలో ఎన్నో అక్రమాలు జరిగాయని, బ్యాంకులో దొంగతనం జరిగిందని అప్పటి అధికార పార్టీ అండతో నిజాన్ని బయటికి రాకుండా నిలువరించారని ఆరోపించారు. చైర్మన్ ఎన్నిక జరిగిన వెంటనే పీఏసీఎస్‌లో అక్రమాలను రైతులకు తెలియజేస్తామన్నారు.



గాంధీభవన్‌లో నల్లగొండ పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేస్తున్న యరగాని నాగన్నగౌడ్, రఘువీర్‌రెడ్డి తరుపున నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

ఎంపీగా పోటీకి అవకాశం కల్పించాలి



తుంగతుర్తి, ఫిబ్రవరి 2 : భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తును అందజేసి, మాట్లాడారు. 20 ఏళ్లకుపైగా కాంగ్రెస్ పార్టీలో ఉండి జిల్లాలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశానన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశానన్నారు. బీసీ కోటాలో తనకు సీటు తప్పకుండా వస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రేగటి వెంకన్న, రెట్నేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ స్థానానికి యరగాని

హుజూర్‌నగర్ : నల్లగొండ పార్లమెంట్ స్థానంలో తనకు పోటీ చేసే అవకాశం కల్పించాలని ఐఎన్‌టీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు యరగాని నాగన్నగౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ పరిశీలకులకు ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించాలని దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆశీస్సులు తీసుకుని దరఖాస్తు చేశానన్నారు. నల్లగొండ పార్లమెంట్‌ను బీసీలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఈదుగంటి సుబ్బారావు, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డి తరపున జైవీర్‌రెడ్డి దరఖాస్తు

హాలియా: నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిత్వం కోసం కుందూరు రఘువీర్‌రెడ్డి తరుపున నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి గాంధీభవన్‌లో శుక్రవారం దరఖాస్తు అందజేశారు. ఆయన వెంట సైదయ్యబాబు, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 2 : వేసవిని దృష్టిలో పెట్టుకుని నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, ఎస్ఎల్‌బీసీ వరద కాల్వలకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలను నింపాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. చెరువులు, కుంటలు ఎండిపోయి, భూగర్భ జలమట్టం పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను నివారణకు చెరువులు, కుంటలను సాగర్ జలాలతో నింపాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జునరెడ్డి, వీ వెంకటేశ్వర్లు, బండా శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఇది స్పీడ్‌బ్రేకర్ మాత్రమే..

● భవిష్యత్ బీఆర్ఎస్‌దే ● అప్పులపై కాంగ్రెస్ దుష్ప్రచారం ● శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులకు కేఆర్ఎంబీకి అప్పగించడంతో నల్లగొండకు తీవ్రనష్టం ● సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు

యాదాద్రి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఫలితాలు స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని.. భవిష్యత్ అంతా బీఆర్ఎస్‌దేనని సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచార సమయంలో బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేశారని, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య సంబంధం ఉందని పుకార్లు సృష్టించారని ఆరోపించారు. బీజేపీ నేతలు బండి సంజయ్, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్‌లను ఓడించింది కాంగ్రెస్ కాదని, బీఆర్ఎస్సేనని తెలిపారు. ఎన్నికల హామీలను తప్పించుకునేందుకు అసలు అప్పు రూ.3.87లక్షల కోట్లుండగా, రూ.7లక్షల కోట్లకు రెట్టింపుచేసి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నర్సింగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేసిందని బీఆర్ఎస్ ప్రభుత్వమని, కాంగ్రెస్ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు మాత్రమే ఇచ్చిందన్నారు. మరి ఫిబ్రవరి 1న గ్రూప్-1 నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేదని జవాబు చెప్పాలని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రైతు రుణమాఫీ, వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్ రూ.4వేలు ఎందుకు పెంచలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెలబెట్టుకోని కాంగ్రెస్‌ను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రైతుబంధు పడటంలేదని జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి బాధ్యతతో అడిగితే, మంత్రి వెంకట్‌రెడ్డి పోలీసులతో బయటకు పంపించారని విమర్శించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డికి నల్లగొండపై ప్రేమ ఉంటే సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడాలని, రైతుబంధు పడటంలేదని ప్రశ్నిస్తే చెప్పుతో కొట్టాలనడం ఏం సంస్కారమని ప్రశ్నించారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులకు కేఆర్ఎంబీకి అప్పగించడంవల్ల నల్లగొండ జిల్లాకు తీవ్రనష్టం జరుగుతుందని, సాగు, తాగునీరు ఉండవన్నారు. దళితబంధులో మంజూరైన నిధులను ప్రభుత్వం ఫ్రీజ్ చేసిందన్నారు. కార్యకర్తలందరూ కష్టపడాలని, ఎంపీ సీటు బీఆర్ఎస్‌దే అని, ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. తెలంగాణకు శ్రీరామరక్ష బీఆర్ఎస్సే అని, కాంగ్రెస్, బీజేపీలు వాటి స్వార్థంకోసమే పనిచేస్తాయని, బీఆర్ఎస్ తెలంగాణ ప్రయోజనాల కోసమే పోరాడుతుందన్నారు. కర్ణాటక ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరిస్తున్నారని, అక్కడి 25 ఎంపీ సీట్లలో నాలుగైదు మాత్రమే వస్తాయంటున్నారని తెలిపారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండునెలలే అవుతోందని, ఆ రాష్ట్రం మాదిరిగా ఉంటే మజా వచ్చేదన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరంలేదని, భవిష్యత్ బీఆర్ఎస్‌దేనన్నారు. ఇదిలా ఉంటే సమావేశం అనంతరం మాజీ మంత్రి హరీష్‌రావు జిట్టా బాలకృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి 40 నిమిషాల పాటు మంతనాలు జరిపారు. ఆయనవెంట రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డిని నిలదీస్తున్న వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి.

ఉద్యమకారులకు గుర్తింపు లేదు...

తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీకి అండగా నిలిచిన నేతలు, కార్యకర్తలకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో గుర్తింపు లభించలేదని, అధిష్ఠానం ఏనాడూ పట్టించుకోలేదని పలువురు నేతలు విస్మయం వ్యక్తం చేశారు. భువనగిరి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో పలువురు సీనియర్ నేతలు మాజీ మంత్రులు హరీష్‌రావు, జగదీష్‌రెడ్డిల సమక్షంలోనే అధిష్ఠానాన్ని నిలదీశారు. పలువురు నేతలు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే తెలంగాణకోసం ఉద్యమించిన, పార్టీని బలోపేతం కోసం కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపు ఇవ్వలేదన్నారు. పార్టీని నమ్ముకుని ఉన్నవారిని కాదని, ఇతర పార్టీల్లో నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికే ప్రాధాన్యం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రితోపాటు, మంత్రులు, సీనియర్ నేతలు కార్యకర్తల కష్టాలను పట్టించుకోలేదని, ఉద్యమకారులుగా పార్టీని ఆదరించామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తన గొయ్యి తానే తవ్వుకుందని, గృహలక్ష్మి, దళితబంధు, తదితర సంక్షేమ పథకాలను ప్రకటించి, అమలు చేయకపోవడంతోనే ఓటమిపాలయ్యామన్నారు. పార్టీలోనే కోవర్టులు, కుట్రలు చేసేవారు అధికమైపోవడంతోనే బీఆర్ఎస్ భువనగిరి అభ్యర్థి ఓటమి చెందారని తెలిపారు. వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నల్లమాస రమేష్‌గౌడ్, రైతుబంధు చైర్మన్ కొలుపుల అమరేందర్, అంబగాని వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీని నమ్ముకుని ఉన్నామని, పార్టీలో తమకు సరైన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరి జోడు పదవులు ఇచ్చి...కిందిస్థాయి నేతలను పట్టించుకోలేదన్నారు. కనీసం తనను వేదికపైకి కూడా పిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుంచి జోడు పదవులు ఇవ్వొద్దని మాజీ మంత్రుల ఎదుట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్‌ను వలిగొండ మార్కెట్ చైర్మన్ రాజవర్ధన్‌రెడ్డి నిలదీశారు.

పదేళ్లుగా ఎదురుచూస్తున్నా...: చింతల



పార్టీలో సముచిత స్థానం కోసం పదేళ్లుగా ఎదురుచూస్తున్నానని, అధిష్ఠానం చూద్దాం... చేద్దామంటూ కాలయాపన చేసిందని పార్టీ సీనియర్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. తాను భువనగిరి నుంచి రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశానని, టీఆర్ఎస్ బలోపేతంకోసం పెద్దఎత్తున నేతలతో పార్టీలో చేరానని తెలిపారు. పార్టీపై విధేయతతో ఉన్నప్పటికీ, అధిష్ఠానం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.

ఆత్మ పరిశీలన చేసుకోవాలి: బాలకృష్ణారెడ్డి



పార్టీ నేతలంతా కూడా ఎన్నికల్లో ఓటమిపై ఆత్మ పరిశీలన చేసుకోవాలని సీనియర్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. ఎన్నికల సందర్భం గా పార్టీలోని సీనియర్ నేతలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, లోపాలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే వేరేవిధంగా అర్థం చేసుకున్నారని వెల్లడించారు. నియోజకవర్గంలోని అందరితో సంప్రదింపులు జరపకుండా ఉండటమే ఎమ్మెల్యే ఓటమికి మరో కారణమని తెలిపారు.

చరిత్రలో కనుమరుగవుతారు : జగదీష్‌రెడ్డి

పొరపాటునో... గ్రహపాటునో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీ మంత్రులు రాజుల్లాగా, నియంతల్లా ప్రవరిస్తున్నారని, అహంకారం ప్రదర్శిస్తే చరిత్రలో కనుమరుగవుతారని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతలను జైల్లో పెడతామని పిచ్చి ప్రగల్భాలు పలుకుతున్నారని, తెలంగాణ ఉద్యమంలో వీరికంటే గొప్పవాళ్లను చూశామన్నారు. ఒకరేమో మాజీ ముఖ్యమంత్రులైన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మరొకరు నారా చంద్రబాబునాయుడు బూట్లు నాకారని విమర్శించారు. అధికారం ఉందని విర్రవీగితే శాశ్వత సమాధి చేస్తామని, దమ్ముంటే కేసీఆర్‌ను పట్టుకుని చూడాలని సవాల్ విసిరారు. జడ్పీ చైర్మన్ రైతుల బాధను మంత్రి కోమటిరెడ్డికి వివరిస్తే... పోలీసులతో సభ నుంచి బయటకు పంపించారని, మంత్రిగా పరువు తీసుకున్నారని విమర్శించారు. రైతుబంధుపై ప్రశ్నిస్తే చెప్పుతో కొడతానని వ్యాఖ్యానిస్తున్నారని, 53లక్షల మంది రైతులను కొడతావా? అని ప్రశ్నించారు. మంత్రి కోమటిరెడ్డి వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని, నీ బండారం బయటపెడతానని హెచ్చరించారు. తాను పదేళ్లలో ఏనాడు వ్యక్తిగత విమర్శలు చేయలేదని, తప్పనిసరి పరిస్థితుల్లో చెప్పుతో కొట్టేలా సమాధానం చెబుతామన్నారు. కాంగ్రెస్ వారు విసునూరు రామచంద్రారెడ్డి (భూస్వామి) వారసులని, తాము అయిలమ్మ, కమలాదేవి, బీఎన్‌రెడ్డి, ధర్మభిక్షం వారసులమన్నారు. ఈ సమావేశంలో భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు జిట్టా బాలకృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

రూ.2లక్షల రుణమాఫీ ఏమైంది ?

● హామీలు నిలబెట్టుకోలేని కాంగ్రెస్‌ను ప్రజలు గమనిస్తున్నారు ● రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతారా? ● మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

దేవరకొండ, ఫిబ్రవరి 2: ఎన్నికల హామీలను నిలబెట్టుకోలేని కాంగ్రెస్‌ను ప్రజలు గమనిస్తున్నారని, పార్లమెంట్, స్థానికసంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం నల్లగొండ జిల్లా దేవరకొండలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతానన్న మంత్రి కోమటిరెడ్డిని దేవరకొండకు వస్తే ప్రశ్నించాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై పల్లెల్లో చర్చపెట్టాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడవద్దని, భవిష్యత్ మనదే అన్నారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రూ.15వేల కోట్లు అప్పులు చేసిందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పులు కూడా పుట్టవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అప్పులు చేస్తే, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని బద్నాం చేస్తున్నారని, అప్పులు చేసి అభివృద్ధి చేయడం తప్పా అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ, రూ.15వేలు రైతుబంధు ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజలు ప్రశ్నిస్తే పోలీసులతో గెంటిస్తున్నారని ఇది సరికాదన్నారు.

ఆచరణకు సాధ్యంకాని హామీలతో..

ఆచరణకు సాధ్యంకాని హామీలు, మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని జగదీష్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్‌పై విమర్శలు చేయడం కాంగ్రెస్‌నేతలకు తగదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల కడుపునింపిందని, కార్యకర్తలకు కొంత అన్యాయం జరిగిందన్నారు. సమీక్షించుకొని కార్యకర్తలు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందని, దేవరకొండలో లీగల్‌సెల్ ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గుత్తా అమిత్‌రెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నేతలు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. కార్యకర్తలు, నాయకులు అధైర్యపడవద్దని, రాష్ట్ర, జిల్లా నేతలందరం అందుబాటులో ఉండి అండగా ఉంటామన్నారు. సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, వడ్త్య రమేష్ నాయక్, గాజుల ఆంజనేయులు, హనుమంతు వెంకటేష్‌గౌడ్, మారేపాకల సురేష్‌గౌడ్, కంకణాల వెంకట్‌రెడ్డి, కేసాని లింగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, వడ్త రమేష్‌నాయక్‌తోపాటు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, మండలాల నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ సర్పంచ్‌లను మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, రవీంద్రకుమార్, సందీప్‌రెడ్డి, అమీత్‌రెడ్డిలు సత్కరించారు.

జీపీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

● స్వచ్ఛభారత్ నిధుల స్వాహా ● సుమారు రూ.8.67 లక్షలు మాయం

● పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్యదర్శి కీర్తి ● నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్)లో ఘటన

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 2: గ్రామ పంచాయతీ కార్యాలయంలోని సిబ్బంది కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ.8.67లక్షల స్వచ్ఛభారత్ నిధులు స్వాహా చేశారు. అర్హులకు దక్కాల్సిన లబ్ధిని తమ బంధువులు, సన్నిహితుల పేరిట చెక్కులు రాసి వారి ఖాతాలకు నగదు బదిలీ చేయించారు. మరుగుదొడ్డి నిర్మించుకున్న లబ్ధిదారులకు కార్యదర్శి ఇచ్చిన చెక్కులు బ్యాంకులో చెల్లుబాటు కాకపోవడంతో ఈ విషయం వెలుగుచూసింది. ఎంపీవో పద్మ, ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం తునికినూతల గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా కీర్తి కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. తండాలో మరుగుదొడ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్వచ్ఛభారత్ మిషన్(ఎస్‌బీఎం) ఖాతాలో సుమారు రూ.8.67లక్షల నిధులు ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం కార్యదర్శి కీర్తితండాలో మరుగుదొడ్లు నిర్మించుకున్న ఇద్దరు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.12వేల చొప్పున చెక్కులు ఇచ్చారు. ఈ క్రమంలో సంబంధిత లబ్ధిదారులు చెక్కులతో రాజవరంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు వెళ్లగా ఎస్‌బీఎం ఖాతాలో నిధులు లేవని సిబ్బంది తెలిపారు. ఇదే విషయాన్ని లబ్ధిదారులు కార్యదర్శికి తెలియజేయగా, ఆమె బ్యాంకుకు వెళ్లి ఖాతా నిర్వహణను పరిశీలించారు. ఏడాదిన్నరగా తన సంతకాన్ని ఫోర్జరీ చేసి నిధులను తునికినూతలతండాకు చెందిన దేవి, మంగీలాల్, శ్రీరాం, సేలి, హరిలతో పాటు మరో ముగ్గురి ఖాతాలకు నగదు బదిలీ చేసినట్లు గుర్తించారు. ఒక్కొక్కరికి రూ.12వేలు చెక్కు ఇవ్వాల్సి ఉండగా, కొంతమందికి రూ.1లక్షకు పైగా చెక్ జారీ చేశారు. ఈ నిధులు డ్రా చేసేందుకు సర్పంచ్, కార్యదర్శి జాయింట్ చెక్‌పవర్ ఉంటుంది. తన సంతకం ఫోర్జరీ చేయటం, బ్యాంకులో చెక్ చెల్లుబాటు కావటంపై గ్రామ పంచాయతీ కార్యాలయ మల్టీపర్పస్ వర్కర్ పాతులోతు పాండు, సర్పంచ్ కుమారుడైన కొర్ర హనుములపై అనుమానం వ్యక్తం చేస్తూ కార్యదర్శి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వీరిద్దరూ ఎనిమిది మంది అనర్హుల ఖాతాలకు నగదు బదిలీ చేయగా ఫిర్యాదులో వారి పేర్లు పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ నిధుల స్వాహా ఘటనపై కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

పోలీసుల అదుపులో సైకో గ్యాంగ్?

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 2: ప్రేమికులు, యువతీ యువకులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతూ బెదిరింపులకు దిగుతున్న సైకో గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నల్లగొండ జిల్లాకేంద్రంలోని గొల్లగూడ గ్రామశివారులో నార్కట్‌పల్లి అద్దంకి - బైపాస్‌కు ఆనుకొని ఉన్న ఓ కాలనీకి చెందిన యువకులు కొంతకాలంగా అటువైపు వెళ్లే ప్రేమికులు, యువతీయువకులపై దాడులకు పాల్పడటం పరిపాటిగా మారింది. ప్రేమికులు, యువతీయువకులు ఒంటరిగా ఉన్న సమయంలో వీడియోలు తీసి బెదిరింపులకు దిగి అందినకాడికి దోచుకోవడంతోపాటు సదరు యువతులు, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడేవారు. ఇటీవల ఓ బాధిత వ్యక్తి ఫిర్యాదు మేరకు స్థానిక సదరు గ్యాంగ్ ముఠా యువకులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ కేసులో పూర్తి వివరాలను ఒకటి రెండు రోజుల్లో పోలీసులు వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

యువకుడి అదృశ్యంపై కేసు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 2: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో యువకుడి అదృశ్యంపై కేసు నమోదైంది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని రెవరోడ్ చాక్‌ఘాట్‌కు చెందిన రాధేశ్యామ్ నార్కట్‌పల్లి శివారులోని రాశీ ఫ్యాక్టరీలో పనిచేయటానికి వచ్చాడు. గత నెల 1వ తేదీన ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. అతనితో పనిచేసే వారు స్వగ్రామానికి వెళ్లినట్లుగా భావించారు. అక్కడి వారిని వాకబు చేశారు. స్వగ్రామానికి రాలేదని తెలియడంతో అదృశ్యమైనట్లు నిర్ధారించుకున్నారు. దీంతో రాధేశ్యామ్ తప్పిపోయాడని అతని సహచరుడు రాంజతన్ కెవత్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాధేశ్యామ్ అదృశ్యంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం : వెంకటయ్య

నల్లగొండరూరల్, ఫిబ్రవరి 2: ఆర్టీసీ కార్మికుల హక్కుల సాధన కోసం ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం పోరాడుతుందని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ రీజియన్ ప్రధాన కార్యదర్శి బాసాని వెంకటయ్య తెలిపారు. నల్లగొండ జిల్లా జిల్లాకేంద్రంలోని ఏఐటీయూసీ భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. కార్మికహక్కులు హరించి సంఘాలు లేకుండా చేసిందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఆర్టీసీ లో సంఘాలను పునరుద్ధరించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ ర్టీసీ నూతన బస్సులు కొనుగోలు చేసి కార్మికులపై పని భారం తగ్గించాలని కోరారు. అనంతరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు. డిపో అధ్యక్షుడిగా వీఎస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎల్ఎన్ స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరసింహ, ఉపాధ్యక్షులు జి.లింగయ్య, సత్తయ్య, సభ్యులుగా బి.లింగయ్య, ఎండి.సాధిక్ బాష, బుపాల్, టీ.ఎం.రెడ్డి, డీఎం.రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మట్టపల్లిలో భక్తవత్సలునికి గరుడోత్సవం

మఠంపల్లి, ఫిబ్రవరి 2: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మట్టపల్లిలో శుక్రవారం శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహుడి నిత్యాకల్యాణం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ఆర్జిత కైంకర్యాలు కొనసాగాయి. ఉదయం హోమాధికాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తదుపరి కల్యాణ మూర్తులను పరిణయ వేదికపై అధిష్ఠింపజేసి పుణ్యాహవాచనం చేశారు. మాంగల్యధారణ అనంతరం గరుడోత్సవం కన్నుల పండువగా సాగింది. ఆలయ తిరువీధుల్లో స్తంబోద్భవుడిని ఊరేగించారు. అనంతరం దేవతమూర్తులను ఆలయ ప్రవేశం చేయించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గరుడోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గ్రామీణ యువతకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 2: తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్‌టీఆర్ఐ)లో తెలంగాణలోని గ్రామీణ యువతీ యువకులకు ఉచిత శిక్షణ - హాస్టల్, భోజన వసతితోపాటు ఉద్యోగం కల్పిస్తున్నామని ఎస్ఆర్‌టీఆర్ఐ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి తెలిపారు. భారత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన- డీడీయూజీకేవై ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణా కార్యక్రమాలకు అర్హత, ఆసక్తిగల గ్రామీణ ప్రాంత అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆమె వివరించారు. సంస్థలో మూడు నెలల కాలపరిమితి గల ఇంటర్మీడియేట్ పాస్ అర్హత గలవారికి బేసిక్ కంప్యూటర్స్ (డాటా ఎంట్రీ ఆపరేటర్లు), మూడు నెలల కాలపరిమితితో బీకామ్ పాస్ అయిన వారికి ఎకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ), 3 నెలల కాలపరిమితితో ఇంటర్మీడియేట్ పాస్ అయిన వారికి కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్, 3 నెలల కాలపరిమితితో పదో తరగతి పాస్ అయిన వారికి ఆటోమొబైల్-2 వీలర్ సర్వీసింగ్, 5 నెలల కాలపరిమితితో పదో తరగతి పాస్ లేదా ఐటీఐ ఉన్నవారికి ప్రాధాన్యం కలిగిన ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్) కోర్సు, 4 నెలల కాలపరిమితితో పదో తరగతి పాస్ లేదా ఐటీఐ ఉన్నవారికి ప్రాధాన్యం కల్పించే సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్, సర్వీస్ కోర్సులకు దరఖాస్తులను ఈనెల 7వ తేదీలోగా సంస్థలో అందజేయాలని కోరారు. అభ్యర్థులు 18-35 వయస్సు గలవారై ఉండాలని, గ్రామీణులై ఉండాలని, చదువు మధ్యలో ఉన్నవారు అర్హులు కారు అని తెలిపారు. అర్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, జీరాక్స్ సెట్, 2 పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఉండాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు రూ. 250 రిఫండబుల్ డిపాజిట్‌గా చెల్లించాలన్నారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222/ 9948466111 నెంబర్లకు ఫోన్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

రామన్నపేటలో పులి కలకలం

రామన్నపేట, ఫిబ్రవరి 2: యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట పట్టణ శివారులో పులి కనిపించిందన్న సమాచారంతో ప్రజల్లో కలకలం కొనసాగుతోంది. గూడ్స్ రైలు గార్డ్ సమాచారంతో పోలీస్, అటవీ శాఖ అధికారులు అప్రమత్తమై పులి కదలికలను గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నారు. పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. మధ్యాహ్నం సమయంలో గూడ్స్ రైలు చిట్యాల నుంచి బీబీనగర్ వైపు రైలు వెళ్లింది. రైలు చివరి క్యాబిన్‌లో గార్డ్ డ్యూటీ చేస్తున్న వ్యక్తి 45 కిలోమీటర్ల రాయి వద్ద (హరిహరపుత్ర రైస్ మిల్లు) పెద్దపులి ట్రాక్‌ను దాటి కొమ్మాయిగూడెం వైపు వెళ్లినట్లు చూశానని రామన్నపేట రైల్వే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించాడు. స్టేషన్ మాస్టర్ అందించిన సమాచారంను రైల్వే ఉన్నతాధికారులతో పాటు పోలీస్, అటవీ శాఖ అధికారులకు సమాచారం చేరవేశారు. సమాచారం అందుకున్న రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, అటవీ శాఖ అధికారులు, యువకులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. రైతులను, గొర్రెల కాపరులను అప్రమత్తం చేశారు. పులి తిరుగుతుందన్న వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో వివిధ గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పులి సంచారం గురించి డీఎఫ్‌వో శోభారాణిని సంప్రదించగా ఈ ప్రాంతంలో పులులు లేవని, అలాగని పులి సంచరించటం లేదని చెప్పలేమన్నారు. అటవీ శాఖ సిబ్బంది పులిని, ఆనవాళ్లను గుర్తించే పనిలో ఫీల్డ్‌లోనే ఉన్నారని ఆమె తెలిపారు.



రైల్వే ట్రాక్‌పై తిరుగుతున్న సీఐ వెంకటేశ్వర్లు, పోలీసులు

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



కొండమల్లేపల్లి : సమ్మె నోటీస్ అందజేస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి, చింతపల్లి, నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, జిల్లా సహాయకార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లి, చింతపల్లి మండల కేంద్రాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. కార్మికచట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోర్డుల ను తెచ్చారని, కనీస వేతనాలు నిర్ణయించే నిర్ణయానికి స్వస్తి పలికారని అన్నా రు. తిరిగి 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రమావత్ జోహార్‌లాల్, రాము, సక్రు, రాందాస్, ఆర్.శంకర్, బిచ్చనాయక్, పకీర, ఆర్.బాల, హేము, సుక్యానాయక్, బోడ పాల్గొన్నారు.

● చింతపల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో లావణ్యకుమారికి ఏర్పుల యాదయ్య సమ్మె నోటీసు అందజేశారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

● సమ్మెలో పాల్గొననున్న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్మాలయాల్లో సీఐటీయూ సంఘం ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

హాలియా, ఫిబ్రవరి 2: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని హాలియా ఫైర్‌స్టేషన్ ఎస్ఐ జానయ్య అన్నారు. శుక్రవారం హాలియా మునిసిపాలిటీలోని టైం పాఠశాలలో అగ్ని ప్రమాదాలను ఎలా నివారించవచ్చనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జానయ్య మాట్లాడుతూ వచ్చే వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని అగ్ని ప్రమాదాలకు గురి కాకుండా అగ్నిని ఎలా ఆర్పాలో విద్యార్థులకు వివరించారు. అగ్నిమాపక సిబ్బంది చేసిన ప్రయోగాలు విద్యార్థులను అలరించాయి. అనంతరం పాఠశాల డైరెక్టర్ మందా నరేందర్‌రెడ్డి ఎస్.ఐ. జానయ్యకు మెమెంటో అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కత్తి కోటిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్స్ అందజేస్తున్న దృశ్యం

చింతపల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని వీటీనగర్, ఘడియగౌరారం ఉన్నత పాఠశాలలతో పాటు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ సీహెచ్ పాండురంగరావు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. తమ సంస్థ విద్యార్థులకు ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అడపాల వాణి, రైసున్నిసాబేగం, భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి



ప్రాక్టికల్స్ పరిశీలిస్తున్న అధికారులు

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 2: ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలని హైపవర్ కమిటీ సభ్యులు బి.ధన్‌రాజ్, ఎస్.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాయి ప్రకర్ష, శ్రీక్రాంతి, ఎస్టీ గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్న ప్రాక్టికల్స్‌ను వారు తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు తగిన సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

చేనేత పాలసీని రూపొందించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండరూరల్, ఫిబ్రవరి 2: చేనేత రక్షణ కోసం సమగ్రమైన చేనేత పాలసీని రూపొందించి, చేనేత కార్మికులను ఆదుకోవాలని చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ కోరారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గంజి మురళీధర్ మాట్లాడుతూ చేనేత సహకార సంఘాల్లో నిల్వ ఉన్న, కార్మికుల వద్ద ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల తరహాలో కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు కూరపాటి రమేష్, స్వామి, మురళి, బాలయ్య, జగన్నాథం, వెంకటేశం తదితరులు ఉన్నారు.

'ప్రత్యేక'పాలన షురూ..

- బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు
- గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారింపు
- అభినందించిన నాయకులు



దేవరకొండ: కొండభీమనపల్లిలో బాధ్యతలు చేపడుతున్న ప్రత్యేక అధికారి శర్మ



పీఏపల్లి: ప్రత్యేకాధికారి మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్యదర్శి, సిబ్బంది

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

గ్రామపంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగియడంతో పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఐదేళ్ల పదవీ కాలం గురువారంతో ముగిసిన నేపథ్యంలో ప్రత్యేక అధికారుల పాలనకు శ్రీకారం చుట్టింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండలస్థాయి అధికారులు గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమించబడ్డారు. బాధ్యతలు స్వీకరించిన అధికారులకు పంచాయతీ కార్యదర్శులు మాజీ ప్రజాప్రతినిధులు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. నేటి నుంచి ప్రత్యేక అధికారులు గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించనున్నారు.

● దేవరకొండ మండలంలోని గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. మండలంలోని 39 గ్రామపంచాయతీల్లో 13 మంది ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు.

● చిట్యాల మండలంలోని వనిపాకల, వట్టిమర్తి గ్రామాలకు ప్రత్యేక అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నర్సింహ, నేరడ, ఎలికట్టెకు ఆర్అండ్‌బీ ఏఈ ఉప్పల సంతోష్‌కుమార్, ఉరుమడ్ల, తాళ్లవెల్లంల, వేంబావికి ఎంపీడీవో బి.లాజర్, పెద్దకాపర్తి, ఆరెగూడెంకు ఎంపీవో ఎ.పద్మ, చిన్నకాపర్తి, బోయగుబ్బకు ఏవో పగిడిమర్రి గిరిబాబు, వెలిమినేడు, పిట్టంపల్లి, బొంగోని చెర్వుకు పశువైద్యాధికారి జి.అమరేందర్, ఏపూర్, పేరేపల్లికి నాయబ్ తహసీల్దార్ రాగ్యానాయక్, గుండ్రాంపల్లి, సుంకెనపల్లికి తహసీల్దార్ దశరథలు నియమితులు కాగా బాధ్యతలను స్వీకరించారు.

● పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీవో వర్కాల మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్.రాంబాబు, పంచాయతీ బిల్ కలెక్టర్ కాశయ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలవ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. నార్కట్‌పల్లి మేజర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీవో సత్యనారాయణ, ఎల్లారెడ్డిగూడెం తహసీల్దార్ పద్మ, చెర్వుగట్టు ఎంపీడీవో యాదగిరి, అమ్మనబోలు ప్రత్యేక అధికారిగా గిరిప్రసాద్‌తో పాటు వివిధ గ్రామాలకు కేటాయించిన అధికారులు ఆయా గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు.

● మునుగోడు మండల పరిధిలోని 26 గ్రామపంచాయతీలకు గాను 13 క్లస్టర్లను ఏర్పాటు చేసి క్లస్టర్‌కు ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులను ఉన్నతాధికారులు నియమించారు. మునుగోడు మేజర్ గ్రామానికి ఎంపీడీవో రాపర్తి భాస్కర్‌గౌడ్, కొరటికల్, దుబ్బకాల్వ గ్రామాలకు తహసీల్దార్ నరేందర్, కొంపల్లి, కల్వకుంట్ల గ్రామాలకు ఎంపీవో సుమలత, ఊకొండి, సింగారం, రత్తిపల్లి గ్రామాలకు నాయబ్ తహసీల్దార్ నరేష్, పలివెల, కోతులారం గ్రామాలకు ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకుడు విజయ్‌భాస్కర్, చొల్లేడు, సోలిపురం గ్రామాలకు పశువైద్యాధికారి డాక్టర్ వెంకన్న, గూడాపూర్, కల్వలపల్లి గ్రామాలకు పశువైద్యాధికారిణి కె.రాధిక, పులిపలుప్పల, గంగోరిగూడెం గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మణిదీప్, ఇప్పర్తి, కిష్టాపురం గ్రామాలకు ఎంఏవో శ్రీనివాస్‌గౌడ్, చల్మెడ, వెల్మకన్నె గ్రామాలకు ఐబీఏఈ సిద్దార్థ, జక్కలవారిగూడెం, రావిగూడెం, కచలాపురం గ్రామాలకు ఎంపీఎస్ శ్రీనివాసులు, చీకటిమామిడి, ఎలుగలగూడెం గ్రామాలకు పీఆర్ఏఈ రామకృష్ణ, జమస్తాన్‌పల్లి, గుండ్లోరిగూడెం గ్రామాలకు కొంపల్లి పశువైద్యాధికారిణి శైలజ బాధ్యతలు స్వీకరించారు.

● తిరుమలగిరి(సాగర్) మండలంలోని 34 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. మండలకేంద్రం, చిల్లాపురం గ్రామాలకు ఎంపీవో పద్మ, రంగుండ్ల, తూటిపేటతండా, సీత్యాతండాలకు ఎంపీడీవో ఖాజా అజ్గర్‌అలీ, రాజవరం, జువ్విచెట్టుతండా, గట్టుమీదితండాల కు తహసీల్దార్ యాదగిరి, తెట్టెకుంట, అల్వాల, శ్రీరాంపురంలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రదీప్‌రెడ్డి, నాగార్జునపేట, తిమ్మాయిపాలెం, చింతలపాలెంలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పెద్దబావితండా, ఎర్రచెరువుతండా, జాల్‌తండాలకు ఎలక్ట్రికల్ ఏఈ సౌజన్య, నెల్లికల్, గోడుమడక, బట్టువెంకన్నబావితండాలకు పీఆర్ ఏఈ జి.సైదులు, పిల్లిగుండ్లతండా, స పావత్‌తండా, నాయకునితండాలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, కొంపెల్లి, బోయగూడెం గ్రామాలకు డీటీ నాగమణి, ఎల్లాపురంతండా, తు నికినూతల, గరకనెట్‌తండాలకు వెటర్నరీ మండల అధికారి డాక్టర్ కేశవ్ అజ్మీరా, ఎల్లాపురం, నేతాపురం, సుంకిశాలతండాలకు ఏవో జానకిరాములు ప్రత్యేక అధికారులుగా నియమించబడగా బాధ్యతలు స్వీకరించారు.



రంగుండ్ల తండాలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో ఖాజా అజ్గర్‌అలీ

ఘనంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జడ్పీ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, అమిత్‌రెడ్డి నాయకులు

నల్లగొండ, ఫిబ్రవరి 2: తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి హాజరై కేక్‌ను కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరంలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, నాయకులు కరీంపాషా, చిట్ల వెంకటేశం, యామ కవితదయాకర్, స్వామిగౌడ్, హరికృష్ణ, వెంకటేశ్వర్‌రావు, సహదేవరెడ్డి, నాగరత్నంరాజు, శ్రీనివాస్, రజిత, శరణ్యరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్, జమాల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో అమిత్‌ప్రత్యేక పూజలు

కనగల్: శాసనమండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ ఆధ్వర్యంలో కనగల్ ఎక్స్‌రోడ్డులో కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. అంతకుముందు దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆయన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా అర్చకులు గుత్తా పేరున అర్చనలు చేశారు. అనంతరం అభిమానులు ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్ అల్లుబెల్లి నర్సింహారెడ్డి, నాయకులు ఐతగోని స్వామిగౌడ్, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, ఎర్రోల సంజీవ, ఎర్రమాద వెంకట్‌రెడ్డి, బైరగోని వెంకన్నగౌడ్, ఎస్‌వెంకటేశ్వర్‌రావ్, భార్గవ్, సుధాకర్‌రెడ్డి, కడారి కృష్ణయ్య, రామలచ్చయ్య, ఆదిమళ్లలింగయ్య, అవురేశి శ్రీను, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



కనగల్: ఎల్లమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న అమిత్‌రెడ్డి

చిట్యాల: చిట్యాలలో బీఆర్ఎస్, గుత్తా యువసేన ఆధ్వర్యంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ జడల ఆదిమల్లయ్య, నాయకులు వనమా వెంకటేశ్వర్లు, కూరెల్ల లింగస్వామి, లక్ష్మయ్య, కర్నాటి ఉప్పల్‌రెడ్డి, సైదులు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు రేపు

నల్లగొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 2: జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏ. బయ్యన్న తెలిపారు. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్‌లోని ఏఎస్ రావునగర్ మైదానంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే 68వ తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లా స్థాయి జూనియర్ బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 2 జనవరి 2004 ముందు జన్మించిన వారు అర్హులని, ఆధార్ కార్డు జీరాక్స్‌తో హాజరుకావాలని, వివరాలకు 9441364104 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు మీనా ఇంజినీరింగ్ కళాశాలలో వైద్యశిబిరం

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 2: పట్టణంలోని మీనా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నేడు వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డైరెక్టర్ షెహ్లాబూతల్ తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధానంగా మహిళలను వేధించే రక్తహీనత, క్యాన్సర్ తదితర వ్యాధులపై నిపుణులు అవగాహన, వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు అందజేస్తారని తెలిపారు.

దళితుల అభివృద్ధిపై చిత్తశుద్ధి కరువు

వేములపల్లి, ఫిబ్రవరి 2: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దళిత సమగ్రాభివృద్ధిపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రెమడాల పరశురాములు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం బడ్జెట్‌లో దళితుల సబ్‌ప్లాన్ కింద రూ.1.65,597 కోట్లు కేటాయించారని, గత బడ్జెట్‌తో పోలిస్తే అంకెలు పెరిగాయే తప్ప నిధుల ఖర్చులో మాత్రం చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదన్నారు. దళితులకు ప్రత్యేక ప్రయోజనం కోసం సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయాలే తప్ప ఇతర అవసరాలకు వినియోగించరాదని ఆయన డిమాండ్ చేశారు. ఒక ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి దళితుల విద్య, వైద్యం, గృహ, ఉపాధి, విదేశీ చదువుల వంటి మౌలిక వసరుల కల్పన కోసం నిధులు ఖర్చు చేయాలన్నారు. ప్రస్తుత బడ్జెట్ బడా పారిశ్రామిక వేత్తలకు ఊతమిస్తూ పేద, మధ్య తరగతి వర్గాలకు ద్రోహం చేసేలా ఉందని ఆయన విమర్శించారు.

ఓటు నమోదు గడువు పెంచాలి

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 2: పట్టభద్రుల ఓటు నమోదు గడువు పెంచాలని కోరుతూ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వికాస్‌రాజ్‌కు వినతిపత్రం అందజేసినట్లు బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఓటు నమోదుకు నాలుగు రోజులే ఉందని, ఇప్పటికి నమోదైన ఓట్లు నామమాత్రంగానే ఉన్నాయన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పాత ఓటర్లు తిరిగి ఓటు నమోదు చేసుకోవాలనడంతో గ్రాడ్యుయేట్లు ఆసక్తి చూపడం లేదన్నారు. పాత ఓటర్లను అలాగే ఉంచి నూతన పట్టభద్రులను ఓటు నమోదు చేసుకోవాలని సూచించాలన్నారు. అదేవిధంగా ఓటు నమోదు గడువును ఫిబ్రవరి నెలాఖరు వరకూ పొడిగించాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట సంఘ నాయకులు రవి, బంటు వీటి ఉన్నారు.

ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

మాడ్గులపల్లి, మర్రిగూడ, కొండమల్లేపల్లి, మునుగోడు, ఫిబ్రవరి 2: ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మాడ్గులపల్లి, మర్రిగూడ తహసీల్దార్లు జమీరుద్దీన్ మోహన్‌సింగ్ అన్నారు. ఆయా మండల కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునే విధంగా బీఎల్‌వోలు పని చేయాలన్నారు. అదేవిధంగా ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకున్న వారు వారి వివరాలను అధికారులకు సమర్పించాలని కోరారు.

● అర్హత ఉన్న పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మోహన్‌సింగ్ కోరారు. ఈ నెల 6వ తేదీలోగా పట్టభద్రులు ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్, నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

● డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎంఎ.సిరాజ్‌ఖాన్, మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి అన్నారు. అర్హులైన వారు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బక్కలయ్య, మల్లేష్‌యాదవ్, స్వామి నందీశ్వర్ పాల్గొన్నారు.

● పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలంగాణ జర్నలిస్టుల ఫోరం (టీజేఎఫ్) అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ (టీఎస్‌టీసీఎఫ్‌సీ) మాజీ ఛైర్మన్ పల్లె రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ప్రార్థనలు

చింతపల్లి, ఫిబ్రవరి 2: దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ నాయకులు కోరారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఈద్గా వద్ద శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలునాయక్‌కు మంత్రి పదవి ఇస్తే వెనుబడిన దేవరకొండ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. తండాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతానికి మంత్రి పదవి ఇచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బుర్రి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నల్లగొండ జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, నల్లగొండ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యకర్తలకు కేకుతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఆయన అభిమానులు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, నాయకులు వంగాల అనిల్‌రెడ్డి, రమేష్, గాద సుధాకర్‌రెడ్డి, ఐతగోని జనార్ధన్‌గౌడ్, కన్నెబోయిన రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

మర్రిగూడ: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు సకాలంలో హాజరై గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

దేవరకొండ: బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ కల్యాణ్‌నాయక్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో దేవరకొండ బీజేపీ నాయకులు కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కల్యాణ్‌నాయక్ కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, దేవరకొండ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్యయాదవ్, జల్దా భాస్కర్, రెడ్డి శంకర్, చండీశ్వర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని టీజీవీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త అఖిల్‌గౌడ్ డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతో ఆ శాఖపై పర్యవేక్షణ కొరవడుతుందని, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

● సర్పంచుల పదవీ కాలం ముగియడంతో కొండమల్లేపల్లి మండల పరిధిలోని అంబోతుతండా, గుర్రపుతండా, దంజిలాల్‌తండా, చెన్నారం సర్పంచులను ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా సన్మానించారు.

మునుగోడు: ప్రజాప్రతినిధులకు పదవులు శాశ్వతం కాదని, ప్రజాసేవతోనే గుర్తింపు వస్తుందని మునుగోడు ఎంపీపీ కర్నాటి యాదవ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచుల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మండల పరిధిలోని సర్పంచులకు మెమోంటో, శాలువాతో పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్పంచులు తమ ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామాల్లో ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతును కూడగట్టుకొని మళ్లీ ప్రజాసేవలో భాగస్వామ్యంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాపర్తి భాస్కర్‌గౌడ్, తహసీల్దార్ నరేందర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎంపీవో సుమలత, డీటీ నరేష్, అధికారులు విజయ్‌భాస్కర్, సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గుర్రం సత్యం, ఫోరం మండలాధ్యక్షుడు మిర్యాల వెంకన్న, వివిధ ఎపీటీసీలు పోలగోని విజయలక్ష్మీసైదులుగౌడ్, బీమనపల్లి సైదులు, కార్యదర్శులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం పలువురు అధికారులు తమ బాధ్యతలను స్వీకరించి సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: భారత రాజ్యాంగంలోని హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్రి వెంకన్న అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్ డైరీ, క్యాలెండర్‌ను తహసీల్దార్ ఆవిష్కరించి మాట్లాడారు. మండలవ్యాప్తంగా పౌర హక్కుల దినాన్ని నిర్వహించి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న తారతమ్యాన్ని పారదోలడం కోసం సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ధర్మాపురం శ్రీను, ఆడెపు సతీష్, నాయకులు రాములు, వెంకటయ్య, రవి, భరత్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉపాధిహామీ కూలీ సమక్షంలో వేడుకలు నిర్వహించారు. మండలంలోని బ్రాహ్మణవెల్లంల, చౌడంపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఎంపీడీవో యాదగిరి మిఠాయిలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

హాలియా: హాలియాలోని కృష్ణవేణి పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన ఇట్రాడ్ సోచ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అంధుల పాటల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంధులు పాడిన అద్భుతమైన పాటలు విద్యార్థులను అలరించాయి. అనంతరం పాఠశాల డైరెక్టర్ నిమ్మల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వైకల్యం శరీరానికి మాత్రమేనని, ప్రతిభకు కాదని పేర్కొన్నారు. విద్యార్థులందరూ ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న అజయ్

చింతపల్లి: దక్షిణ భారతదేశ స్థాయిలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని వీటీనగర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అజయ్ ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో అజయ్ మూడవస్థానాన్ని పొందడంతో పాటు దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనలో తెలంగాణ రాష్ట్రం నుంచి మూడో స్థానంలో నిలిచి అవార్డును అందుకున్నారు. ఢిల్లీలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే అవకాశం సాధించారు. దీంతో హెచ్ఎం డాక్టర్ అడపాల వాణి, ఉపాధ్యాయులు వి ద్యార్థిని అభినందించారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్‌లో 2022-23 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి పూర్తి చేసి బాసర ఐఐటీలో ప్రవేశం పొందిన మునగాల శృతి, గిరి ప్రణతి, రావుల అనిల్‌లకు ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున గణిత ఉపాధ్యాయుడు శ్రీపతిరావు కుమార్తె శ్రీచందన, కుమారుడు శ్రీచరణలు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించి నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సముద్రాల శ్రీనివాస్, అక్కిరెడ్డి, చంద్రయ్య, దయాకర్, జగదీష్, నాగరాజు, లోక్యానాయక్, అశోక్‌రెడ్డి, లక్ష్మయ్య, జనార్ధన్‌రెడ్డి, నర్సింహరావు, మంజుల, నీరజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.